నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
మంగళవారం | 11 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు

# శ్రీశైలం రానున్న సీఎం



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**-మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లన్నకు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబు శ్రీశైలం వచ్చే అవకాశం ఉందని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. శ్రీశైలంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంత్రులు ఆనం,సత్యప్రసాద్, అనిత,జనార్దన్ రెడ్డి,ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిలు మీడియాసమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 25,26న దేవస్థానం టోల్గేట్ల వద్ద భక్తులు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించవద్దని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

- రెట్టింపైన పెట్టుబడి ఖర్చులు
- గిట్టుబాటు ధర లేక లబోదిబోమంటున్న రైతన్నలు
- కిందటేడాది మిర్చి క్వింటానికి రూ. 20 వేల నుంచి రూ. 24వేలు పలికిన ధర
- ప్రస్తుతం క్వింటానికి రూ.9 వేల నుంచి రూ. 13 వేలే
- రూ. 20 వేలు పైనే ధర చిక్కితేగాని రైతు గట్టెక్కే పరిస్థితి లేదు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు వేడుకోలు

## అన్నదాతను కన్నీళ్లు పెట్టిస్తున్న

2లో




- ప్రతి భక్తునికి పూర్తి సంతృప్తి దర్శనమయ్యే విధంగా, తొక్కిసలాట లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోండి
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించండి
- దేవస్థానం అధికారులను,జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించిన మంత్రుల బృందం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రానికి విచ్చేసే సామాన్య భక్తులకు పెద్దపీట వేసి తొక్కిసలాట లేకుండా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను సంతృప్తికరంగా దర్శించుకునేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం దేవస్థాన అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. సోమవారం శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణ భవన ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్,హెూం శాఖ మంత్రి వి.అనిత, రాష్ట్ర రోడ్లు,భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి,ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, దేవదాయశాఖ మిగతా 2లో

## మహాశివరాత్రి ఉత్సవాల్లో

# సామాన్య భక్తులకే పెద్దపీట




సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రుల బృందం,నంద్యాల కలెక్టర్,ఎస్పీ, శ్రీశైలఆలయ ఈఓ, శ్రీశైలం ఎమ్మెల్యే

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై

# ప్రత్యేక దృష్టి సారించండి

- ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి విధులు నిర్వహించండి
- పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 310 దరఖాస్తులు
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణీయా సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సుండిపెంట ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజలు,చెంచు గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు.జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్,ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి,ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్,ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిగతా 2లో

### సీఎం కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను

# వేగవంతంగా పరిష్కరించాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతినిధి :** సిఎం కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌భాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునాయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. సిఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ ఆర్డీఓకు సంబంధించి 17,సబ్ కలెక్టర్ ఆదోనికి సంబంధించి 16,కర్నూలు ఆర్డీఓకు సంబంధించి మిగతా 2లో



ప్రజా పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాష

### కొండగుట్టకు

# పట్టాదారు పాసు పుస్తకాలు..!

- మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు..?
- కొండగుట్టలో పత్తి, మిరప పంట వేసినట్లు ధృవీకరిస్తున్న మండల వ్యవసాయ శాఖ సిబ్బంది
- అక్రమ పట్టాదారు పాస్ పుస్తకాలతో ప్రభుత్వ సొమ్మును దిగిమింగుతున్న ఇద్దరు రైతులు
- ప్రభుత్వ సొమ్మును దిగమింగన పార్టీ నేత , ఇద్దరు రైతుల పై రికవరీ కేసు నమోదు చేయండి
- పట్టాదారు పాసుపుస్తకాలను రద్దుపరిచి ఆ రైతుల పై చర్యలు తీసుకోవాలి..
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎఫ్. ఆర్. టి. ఐ. జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న

**పెద్దకడబూరు,మేజర్ న్యూస్ :** భూమి లేకున్నా కొండగుట్టును పట్టాదార్ పాస్ పుస్తకాలు సృష్టించుకుని ప్రభుత్వ పథకాలు ద్వారా వచ్చే సబ్సీడీ సొమ్ము దిగమింగుతున్న ఓ పార్టీ నేత ఇద్దరు రైతులు పై చట్టపరమైన చర్యలు తీసుకొని వారి పైకేసు నమోదు చేయాలంటూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఫోరం ఫర్. ఆర్టీ.ఐ .జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న సోమవారం విలేకరులకు విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. మిగతా 6లో

సూర్య



# మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎస్.పి.అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఉత్సవాల అధికారి చంద్రశేఖర్ ఆజాద్,దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావుతో కలిసి మహాశివరాత్రి ఏర్పాట్లపై విస్తృత సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి తొక్కిసలాటలు లేకుండా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనమయ్యేలా పటిష్ట ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు వసతులు కల్పించాలని దేవస్థాన అధికారులను,జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పలు బ్రహ్మోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా,వైభవంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు.ఈ మేరకు గత సంవత్సరం కంటే ఈ ఏడాది 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మేరకు ఏర్పాట్లు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు.రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ..రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రతి భక్తునికి శ్రీస్వామి అమ్మవార్ల అనుగ్రహం పొందేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని,హోల్డింగ్ ఏరియా, పార్కింగ్ ప్రాంతాలు సక్రమంగా గుర్తించి పార్కింగ్ ప్రాంతం నుండి ఉచితంగా మినీ వాహనాల ఏర్పాట్లు,దేవాలయం వద్దకు భక్తులను చేర్చేలా ఉండాలని సూచించారు.11 రోజుల మహాశివరాత్రి కార్యక్రమాలలో క్యూ లైన్ నందు భక్తులకు పాలు, మంచినీరు,బిస్కెట్లు అల్పాహారం పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు.పసిపిల్లలు కలిగిన వారికి క్యూలైన్లో ఉన్న మహిళలకు పాలు బిస్కెట్లు అందిస్తామని తెలిపారు.మహా శివరాత్రి పర్వదిన సమయాలలో 24, 25, 26,27 నాలుగు రోజులలో క్యూలైన్లలో వచ్చిన భక్తులకు ఉచిత లడ్డు ప్రసాదం అందజేయాలని దేవస్థానం అధికారులను మంత్రి ఆదేశించారు.ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఆరు డ్రోన్ కెమెరాలను పోలీసు అధికారులకు ఇచ్చేందుకు దేవదాయశాఖ సిద్ధంగా ఉందని,ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా ఎస్పిని సూచించారు.అలాగే ట్రాఫిక్ అంతరాయం లేకుండా పర్యవేక్షించేందుక అవసరమైన మోటార్ వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.40 కి.మీ మేర పాదయాత్రతో వచ్చే భక్తులకు స్థానిక చెంచు గూడెములలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మంచినీరు,బిస్కెట్లు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అటవీ చెక్‌పోస్టులను, దేవదాయశాఖ చెక్ పోస్టులలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఉచితంగా వాహనాలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సంబంధితఅధికారులను ఆదేశించారు. రెవెన్యూ,పోలీస్, దేవదాయ శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని,ప్రముఖుల దర్శనాలకు టైంస్లాట్ ఏర్పాటు చేయాలన్నారు.ఎంఎల్‌ఏ సూచనలు ఆహ్వానించదగినవని అన్నారు.ఈ సమావేశానికి ముందు దేవస్థానంకార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను విపులంగా వివరించారు.అంతకంటే ముందు ఉదయం దేవదాయశాఖ కమీషనర్,రామచంద్ర మోహన్,జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి,చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్.చంద్రశేఖర అజాద్‌లు భక్తుల క్యూలైన్లు, పాగాలంకరణ ఏర్పాట్లు, కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంకు హాజరైన అధికార యంత్రాంగం

# మహిళా పిల్లలతో అదృశ్యం

**భర్త ,అత్తమామల వేధింపులు తాళలేక ..**

**కర్నూల్ క్రైమ్ మెజర్ న్యూస్:** భర్త ,అత్తమామల వేధింపులు తాళలేక ఓ మహిళా తన పిల్లలతో అదృశ్యమైన సంఘటన నగరంలో ఆదివారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కర్నూలు తాలూకా పరిధిలోని నంది కొట్కూరు రోడ్డులో ఉన్న భూపాల్ నగర్ లో మహాలక్ష్మి అనే మహిళ తన భర్త శివ అతని కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తుంది.ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆమె భర్త ,అత్త ,మామలు ఆడ పిల్లలు పుడుతున్నారని వేధిస్తు ఉండేవారు. అయితే మహిళ మళ్లీ గర్భం దాల్చడంతో ఈ సారి ఆడపిల్ల పుడితే..నీకు విడాకులు ఇచ్చి మీ అమ్మ నాన్నల దగ్గరకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు.దీంతో బాధిత మహిళ లక్ష్మీ తనకు మళ్లీ ఆడపిల్ల పుడితే..తన అమ్మ నాన్నల వద్దకు పంపిస్తారనే భయంతో ఆదివారం మధ్యహ్నం సమయంలో తన ఇద్దరూ ఆడ పిల్లలు పెద్ద పాప శ్రీని వయసు (5) సంవత్సరాలు ,చిన్న పాప శ్రీ వయసు (3) సంవత్సరాలతో పాటు ఇంటి నుండి అదృశ్య మైంది.దీంతో భయపడ్డ మహిళ అత్త పార్వతమ్మ విషయాన్ని మహిళ తండ్రి బాల స్వామికి తెలియజేసింది. విషయం తెలుసుకున్న మహిళ తండ్రి బాలస్వామి కర్నూలు కు వచ్చి బంధువులను విచారించి,ఎక్కడా కనబడకపోవడంతో తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని మహిళ,ఇద్దరు పిల్లలను వెతికేందుకు రెండు టీంలను ఏర్పాటు చేసినుట్ల సిఐ శ్రీధర్ తెలిపారు.



## సిఎం కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

17,డిఎస్‌ఓకు సంబంధించి 2,జిల్లా పురావస్తు అధికారి,కోఆపరేటివ్ అధికారి,జిల్లా రిజిస్ట్రార్,పౌర సరఫరాల అధికారి,హౌసింగ్ పిడి,వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఒక్కోక్క దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య,అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డిఆర్‌ఓ సి వెంకట నారాయణమ్మ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బికె వెంకటేశ్వర్లు,కొండయ్య,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## యాగంటి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను విడుదల చేసిన మంత్రి బి.సి దంపతులు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి వారి సతీమణి బి.సి ఇందిరమ్మలు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆలయ ఈ.ఒ చంద్రుడు, యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం చేసిన బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలో కీ.శే పుల్లారెడ్డి జ్ఞాపకార్థం గత 15 రోజుల నుండి నంద్యాల జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహించడం జరిగింది. మొత్తం 43 టీములు పాల్గొనగా చివరి రోజు ఫైనల్ మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ (నంద్యాల) మరియు ఆర్గనైజింగ్ టీమ్ (బనగానపల్లె) పోటాపోటీగా పోటీ పడ్డారు. చివరికి రాయలసీమ టీము విజేతగా నిలవగా ఆర్గనైజింగ్ టీమ్ రన్నర్‌గా నిలవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ మొదటి బహుమతిని రూ. 30వేల రనూపాయలు సొంత నిధులతో ఇవ్వడం జరిగింది. అలాగే 02,03,04వ బహెమతులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను కూడా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. క్రీడాకారులకు తమ కుటుంబం సహాయ సహకారాలు ఎప్పటికీ ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, తెలుగుదేశం యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న బి.సి ఇందిరమ్మ

# అన్నదాతను కన్నీళ్లు పెట్టిస్తున్న మిర్చి ధర

**ఎమ్మిగనూరు రూరల్,మేజర్ న్యూస్:** పగలనకా రాత్రనకా ఎంతో వ్యయప్రయాసాలకోర్చి కష్టపడి పండించిన అన్నదాతలకు ఈ ఏడాది మిర్చి ధర కన్నీళ్లు తెప్పిస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈసారి కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. రోజు రోజుకి పెట్టుబడి వ్యయం పెరిగిపోతున్నా.. పంట దిగుబడి కూడా అంతంత మాత్రంగానే ఉందని వారు వాపోతున్నారు. కురిస్తే అధిక వర్షాలు, లేదంటే అరకొర వర్షాలు, లేకపోతే అకాల వర్షాలు ఇప్పటికీ రైతును వెంటాడుతూనే ఉన్నాయి. ఏటేటా ప్రకృతి కూడా తమకేం సహకరించడం లేదని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలలోనైతే ప్రధానంగా పత్తి, మిరప పంటలకే మొగ్గు చూపడం.. వీళ్లంతా సన్న కారు రైతులే కావడంతో ఈ సంవత్సరం కూడా నష్టాలతో రైతన్నలు అప్పుల ఊబిలోకి కూరుకుపోయే పరిస్థితులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. వర్షాధారం కింద, బోరు బావుల కింద ప్రధానంగా తేజ, డీలక్స్ వెరైటీ, బ్యాడిగ రకాలను ఇక్కడి రైతులు ఎక్కువగా సాగు చేసుకుంటున్నారు. విత్తనాలు, క్రిమిసంహారక మందు పిచికారీలకు, పంట కోత, కల్లంలో కాయల గ్రేడింగ్, కూలీలు, పంట సాగు, మిగతా పెట్టుబడి ఖర్చులు కలిపి రైతులకుతడిసి మోపెడవుతున్నాయని వారు గగ్గోలు పెడుతున్నారు. అంతేగాక ఈ ఏడాది మిరప పంటలో తాలు శాతం పెరగడం, తెగుళ్లు, చీడపీడలకుతోడు మార్కెట్‌లో దారుణంగా రేట్లు పతనం కావడంతో మిరప రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఎంతలేదన్న ఎకరా మిర్చి సాగుకు రూ. లక్షన్నరకు పైగా వ్యయం అవుతోంది. ఇప్పుడేమో మద్దతు ధర లభించడం లేదు, ఏం చేయాలో అర్థంకావడం లేదని వారు భోరుమంటున్నారు. కిందటి సంవత్సరం క్వింటం మిరప రూ. 20 నుంచి రూ. 24 వేల వరకు ధర పలికింది. అయితే ఈ ఏడాది మాత్రం గుంటూరు, కర్నాటక రాష్ట్రంలోని బ్యాడిగ మార్కెట్లో ప్రస్తుతం క్వింటం కేవలం రూ. 9 వేల నుంచి రూ. 13 వేలు మాత్రమే ధర పలుకుతోంది. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి సంగతి దేవుడెరుగు కనీసం మిరప కోతలకు కూడా ఇది ఏమాత్రం సరిపోవడం లేదని మట్టి మనుషులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ధరలు పతనం కావడంతో ఇప్పటికీ చాలామంది రైతులు పంటను ఏసీ గోడౌన్లలో నిల్వ చేసుకున్నారు. మంచి ధర లభిస్తే విక్రయించాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. క్వింటం మిరప కనీసం రూ. 20 వేలు పైనే ధర చిక్కితేగాని తమకు ఏమాత్రం గిట్టుబాటు అయ్యే పరిస్థితులు కనిపించడంలేదని స్పష్టం చేస్తున్నారు. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా ప్రస్తుతం ధరలు మరింత దిగజారినట్లు తెలుస్తోంది. ఇక అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక రైతన్నలు తలలు పట్టుకుని కూర్చున్నారు. ఇప్పటికైనా కష్టాల్లో ఉన్న రైతు కోసం మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

(మొదటి పేజీ తరువాయి)

జి. రాజకుమారి మాట్లాడుతూ..ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి సానుకూల దృక్పథంతో విధులు నిర్వహించాలన్నారు.మండల స్థాయి అధికారులు సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రతి పారామీటర్‌లో గ్రామస్థాయి అధికారులతో పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.క్షేత్రస్థాయిలో చేపడుతున్న పింఛన్ల పంపిణీ,రీ సర్వే,మ్యుటేషన్ దరఖాస్తుల క్లియరెన్స్ తదితర అన్ని పనులు ఆర్టిజిఎస్ ద్వారా ప్రభుత్వం పరిశీలిస్తోందని,అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వ సూచనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.రెవెన్యూ సదస్సులు,రీ–సర్వే ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆషామాషీగా క్లియర్ చేస్తే ఒప్పుకునేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో ఇంకా 1500 మంది ఉద్యోగులు ఎంప్లాయిస్ హెల్డ్ డేటాలో తక్షణమే నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్ శాఖల ద్వారా పనులు ప్రారంభించి పెండింగ్ లో ఉన్న రహదారి గుంతలు,సిసి రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణాలకు అవసరమైన భూములు గుర్తించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అసంఘటిత కార్మికులను ఈ – శ్రామ్ పోర్టల్ లో నమోదు చేసే ప్రక్రియను సంబంధించిన అధికారులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా వ్యాప్తంగా పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 310 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు అర్జీలు సమర్పించారు.ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

**శ్రీశైలం ప్రాజెక్టు భూ కబ్జాలపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం :** శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ఇటీవల కాలంలో పెరుగుతున్న భూకబ్జాలపై నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పంచాయతీరాజ్ శాఖ అధికారులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.భూ ఆక్రమణలు కొనసాగుతుంటే ఏం చేస్తున్నారని అధికారులపై ఆమె మండిపడ్డారు.ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేయాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమాలపై పూర్తిస్థాయిలో తనకు నివేదికలు అందించాలని కలెక్టర్ కోరగా పంచాయతీరాజ్ శాఖ ఎంపీడీవో,పంచాయతీ సెక్రెటరీ వారంలోగా నివేదికలు అందచేస్తామని కలెక్టర్కు బదులిచ్చారు.భూకబ్జాలపై సహించేది లేదని నివేదికలు అందిన వెంటనే తగు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

**ఐటీడీఏ అధికారులతో కలెక్టర్ సమీక్ష :** శ్రీశైలం ఐటీడీఏ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి సమీక్షించారు.గిరిజన అభివృద్ధికై ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి గిరి పుత్రుడికి అందాలన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గిరిజన గూడెలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు మానవత దృక్పథంతో ముందుకు సాగాలన్నారు.

# స్మశానవాటిక సమస్యను అధికారులు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న చెట్నహళ్లి గ్రామస్తులు

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** కర్నూను జిల్లా మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామంలో స్మశాన వాటిక సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని ఆ గ్రామస్తులు అంజిని,వెంకటేశులు, నాగేష్, మల్లేష్‌లు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం చెట్నహళ్లి గ్రామస్తులు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ పి రంజిత్‌భాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామం దాదాపు 400ఏళ్ల క్రితం వెలసిందని నాటి నుండి మేము మా గ్రామ స్మవాన వాటికగా గ్రామ సర్వేనెంబర్లు 113లో 3.83ఎకరాలు మరియు 114ఎలో 1.02ఎకరాల భూమిని మా గ్రామ అవసరం నిమిత్తం హిందూ స్మశాన వాటికగా వాడుకుంటున్నామన్నారు. ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమి,రస్తా మరియు సిలింగ్ భూమిగా ఉందని అప్పటి నుండి ఇప్పటివరకు ఎటువంటి ఆటంకం లేకుండ గ్రామంలో కలిసిమెలసి ఈ స్థలంలో శవ ఖనన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మద్యకాలంలో గత ప్రభుత్వం ఇదే స్థలంలో మంత్రాలయం నియోజకవర్గంలోని ఎస్‌సిలను రెచ్చగొట్టి హిందువులపై ఎస్‌సి కేసులు పెట్టిస్తూ ఘర్షణలకు ప్రేరేపిస్తున్నారన్న సంగతి మా ప్రాంతంలో అందరికి తెలిసిందేనని ప్రస్తుతం గ్రామంలో హిందువులు మరణిస్తే శవ ఖనన కార్యక్రమాలు చేసుకోవాలంటే భయంగా ఉందని తమరు మా గ్రామంపై దయుంచి ఈ విషయంలో కల్పించుకుని స్మశానంలో ఉనన ఇంటి స్థలాలు,నిర్మించిన ఇళ్లను తొలగించి స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని కోరారు. అలాగే కుల,మత పరంగా విద్వేషాలు రెచ్చగొట్టి గ్రామంలో ఘర్షణ వాతావరణం సృష్టించిన ఎస్‌సిలు వారి కుల నాయకులపై గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి
# యోగా లీగ్ పోటీలు

**- లీగ్ ఓవర్ ఆల్ చాంపియన్లుగా కర్నూలు జిల్లా జట్టు**



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కర్నూలు జిల్లా జట్టు

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆద్వర్యంలో గత రెండ్రోజులుగా పెద్పాడులోని వేదాన్ని పాఠశాల నందు నిర్వహిస్తున్న 1వ రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి కర్నూలు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రేణుక ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, యోగా అసోసియేషన్ ఆఫ్ కర్నూలు జిల్లా సంయుక్త ఆద్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా అనేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మాట్లాడుతూ లీగ్ పోటీల ఓవరాల్ చాంపియన్‌గా కర్నూలు జిల్లా జట్టు 105పాయింట్స్ నిలిచిందని,95పాయింట్లతో అనంతపూర్ జిల్లా జట్టు రెండోస్థానంలో నిలువగా,92పాయింట్లు నంద్యాల జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వేదాన్ని పాఠశాల కరస్పాండెంట్ పరమేష్,పోటీల నిర్వాహక అధ్యక్ష,కార్యదర్శులు దండు విద్యాసాగర్,ఫయాజ్,జిల్లా యోగ సంఘం సభ్యులు ఈశ్వర్ నాయుడు,ముంతాజ్ బేగం,పద్మలత తదితరులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపిడిఓ

కల్లూరు,మేజర్ న్యూస్ : మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో,అంగన్‌వాడి కేంద్రాలలో ఉండే విద్యార్థులందరికి సోమవారం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఓ జిఎన్‌ఎస్ రెడ్డి,ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల రక్తహీనత నుండి బయటపడతారన్నారు. అలాగే నులిపురుగులు కూడా బయటకు రావడం జరుగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, అధికారులు,ఆశాలు,అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ మధుమౌనిక

**పాణ్యం, మేజర్‌న్యూస్ :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పాణ్యం మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధుమౌనిక ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరి చేత ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మధుమౌనిక మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. నులిపురుగుల నివారణ వలన రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పోషక ఆహార వినియోగాన్ని పెంచుతూ రక్త హీనతను నియంత్రించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు 37, ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు 27, ఇప్పటి వరకు 96.5 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి గుడి పున:నిర్మాణానికి భూమిపూజ



ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణ భూమిపూజ చేస్తున్న టీడీపీ యువ నాయకులు ఎన్ఎండి యాజ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని 15వ వార్డులోని ఆంజనేయస్వామి గుడి నిర్మా భూమిపూజకు గుడి కమిటీ వారి ఆహ్వానం మేరకు టీడీపీ రాష్ట యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మా ణంలో భాగంగా ఈరోజు 15వ వార్డు భూమిపూజ చేయడం చాలా సంతోషంగా ఉందని ఆంజనేయస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈకార్యక్రమంలో 15వ వార్డు ఇన్‌చార్జి ఎబినైజర్, నాగేశ్వరరావు, కౌన్సిలర్ నాగార్జున, షేక్ మున్నా, దేరెడ్డి శివనాగిరెడ్డి, న్యాయవాది బాబురావు, బద్రిశెట్టి రవి, సురేష్‌కుమార్, డాక్టర్ సంజీవ, నాగరాజు, కోశాధికారి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యాదవులకు కెడిసిసి ఛైర్మెన్ పదవి ఇవ్వాలి



టీడీపి నాయకులు నాగరాజు యాదవ్‌తో ఆలూరు యాదవ సంఘం నాయకులు

**ఆలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో టీడీపీ పార్టీ గెలువులో కీలక పాత్ర పోషించిన యాదవులను గుర్తించి వారికి కెడిసిసి ఛైర్మెన్ పదవి పట్టణ అధ్యక్షులు నాగరాజు యాదవ్ కు ఇవ్వాలని జిల్లా యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం కర్నూల్ జిల్లా పరిషత్ లో ఏర్పాటు చేసిన యాదవుల ఆత్మీయ సమావేశంలో జిల్లా నలుమూలల నుండి యాదవ సంఘం నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, ఎంపిటిసి బంగారు పటేల్ యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్,రాము యాదవ్,తిమ్మారెడ్డి యాదవ్ లు మాట్లాడుతూ జిల్లాలో జనాభాలో రెండో స్థానంలో ఉన్న యాదవులకు టీడీపి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని ఇతర బిసి కులాల నాయకులకు గుర్తింపు ఇచ్చిన మాదిరిగా యాదవులకు కెడిసిసి ఛైర్మెన్ లేక జిల్లా టీడీపీ భాధ్యతలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఒక్క యాదవ నాయకుడికి టీడీపీ ప్రభుత్వం ఉన్నత స్థానం కల్పించలేదని వచ్చే ఎన్నికల్లో జడ్పి ఛైర్మెన్ పదవి యాదవులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వెంకటేష్ యాదవ్, సోమలింగ,దత్తా, యాదవ్,శ్రీనివాసులు,చంద్ర,గోవర్ధన్, కృష్ణ మూర్తి, సాయి,భాస్కర్ లు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



ఆల్ బెండాజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డాక్టర్లు

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని నారాయణాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ దినేష్‌ల ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరి చేత ఆల్‌బెండాజోల్ మాత్రలను మింగించడం జరిగిందని వైద్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. నులిపురుగుల నివారణ వలన రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పోషక ఆహార వినియోగాన్ని పెంచుతూ రక్త హీనతను నియంత్రించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఏడాది నులి పురుగులను నియంత్రించడం కోసం ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి ఆల్ బెండాజోల్ మాత్రలను మింగించడం జరుగుతుందని అన్నారు. బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారిణీలు డాక్టర్ సవిత, డాక్టర్ భావనారెడ్డిల ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్ర పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ల నందు ఆల్ బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంకోర్ టెక్నాలజీ అకాడమీ సంస్థతో శాంతిరాం ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందజేసుకుంటున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, బెంగుళూరుకు చెందిన ఎంకోర్ టెక్నాలజీ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య పారిశ్రామిక సహకార ఒప్పందం కుదిరినట్లు కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులు, బోధన సిబ్బందికి పరిశ్రమ నిపుణుల ఉపన్యాసాలు, ఆధునిక వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ ప్రమాణాల ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ఒప్పందానికి కళాశాల తరపున సంతకం చేశారు. ఎంకోర్ టెక్నాలజీ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీసాయి శ్రీనివాస్ కళాశాలను సందర్శించి నిపుణ నియామక ప్రక్రియను నిర్వహించడంతో పాటు ఎంఓయు సంతకం చేశారు. ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు అమలులో ఉండనున్నది. విద్యార్థులు ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పరిశ్రమల ఎలక్ట్రానిక్స్ రంగాలలో అత్యాధునిక పరిశ్రమ అనుభవాన్ని పొందే అవకాశాన్ని ఇది కల్పించనుంది. శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ విద్యార్థులకు ప్రపంచస్థాయి అవకాశాలను అందించేందుకు అంకితభావంతో ముందుకు సాగుతోందన్నారు.

# విద్యార్థులు పరీక్షల భయం వీడాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి పరీక్షలు దగ్గరవుతున్న తరుణంలో విద్యార్థులు భయం నుంచి బయటపడాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాలలోని కేఎన్‌ఎం హైస్కూల్, ఇతర పాఠశాలల్లో పరీక్ష క్యాంపియన్ నిర్వహించారు. పరీక్షలకు తయారు కావడం, రాసే విధానం, పరీక్షల్లో తక్కువ సమయంలో ఎక్కువ రాయడం లాంటి మెలుకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ హాఫీస్, ఇమాదుల్లా, ఇర్ఫాన్, పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిద్ధారూఢ పూజ మహోత్సవాలు ప్రారంభం

– మూడురోజులపాటు పూజ కార్యక్రమాలు

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలోని దొడ్డజిన్నా కాలనీలో వెలసిన శ్రీశ్రీసిద్ధారూఢ స్వాముల వారి మహోత్సవ కార్యక్రమాలు సోమవారం నుండి ప్రారంభం అయ్యాయి. ఈ పూజ కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. అలాగే ఈ మహోత్సవాలకు కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు పాల్గొని ఉపన్యాసాలు ఇవ్వడం జరుగుతుంది. సోమవారం ఈ ఉత్సవాలను సిద్ధారూఢ శాంతశ్రమం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. స్వామివారికి అభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్ప అలంకరణ, మంగళారతులు, ధ్వజారోహణ వంటి పూజలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా గురువుల మాట్లాడుతూ గురువులు ప్రసాదించే జ్ఞానం వల్ల మనిషి జీవితం సార్థకం అవుతుందన్నారు. మంచి గుణం ఇచ్చి, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని దేవున్ని కోరుకోవాలన్నారు. ఎల్లప్పుడు భగవంతుని నామస్మరణం చేపడితే అంతా మంచి జరుగుతుందన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేపట్టారు. భక్తులకు మూడురోజులపాటు అన్నదానం కార్యక్రమం చేపడుతున్నట్లు సిద్ధారూఢ శాంతశ్రమ భక్తులు తెలిపారు.



జ్యోతిని వెలిగించి మహోత్సవాలను ప్రారంభిస్తున్న గురువులు



పూజలందుకుంటున్న సిద్ధారూఢ స్వాములవారు

## వసతి గృహానికి భూమి పూజ చేసిన పాణ్యం ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

**కల్లూరు,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పర్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న బాలుర వసతి గృహానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. అధికారులు సమయపాలన పాటించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మేకల శేషన్న,ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి రామాంజనేయులు,టిడిపి నాయకులు శేఖర్,రామాగిడ్డయ్య,మహానంది,రవి,మాజీ ఎంపిటిసి మాదేష్, పెద్దపాడు తిరుమలేష్‌రెడ్డి,సల్కాపురం దేవేంద్రరెడ్డి,ఉలిందకొండ ఈవి రమణ,నెరవాడ జాఫర్,గోకులపాడు వరదారెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 7వ అదనపు జిల్లా జడ్జిని కలిసిన మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ లీగల్ అడ్వైజర్



**కల్లూరు,మేజర్ న్యూస్ :** మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ లీగల్ అడ్వైజర్ శిల్ప సోమవారం 7వ అదనపు జిల్లా జడ్జి వి లక్ష్మి రాజ్యంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వారి శాఖ తరుపు ఉన్న కేసుల గురించి మరియు విక్టిమ్ కాంపెన్సేషన్ ప్రొసీజర్ గురించి జడ్జితో చర్చించారు. ఈ విషయమై జడ్జి సానుకూలంగా స్పందించడం జరిగింది.

## ఆలయ భూముల లీజుపై పరిశీలన



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని చామకాలువ వద్దనున్న శ్రీ ప్రథమ నందీశ్వరస్వామి ఆలయ భూముల లీజు గురించి కర్నూలు దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ పట్టెం గురుప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిసి గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 18న ఆలయానికి సంబంధించిన 3 ఎకరాల భూమిని 11 సంవత్సరాల లీజు కాలానికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ మల్టీ జోన్-2 రీజినల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ సూచనలు మేరకు ఈ భూమిని పరిశీలించామని అన్నారు. ఆర్‌జెసి ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లీజుపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దండోరా ద్వారా, కరపత్రాల ద్వారా, పత్రికల ద్వారా తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామానుజన్, నంద్యాల గ్రూపు దేవాలయాల తనిఖీ అధికారి హరిశ్చంద్రా రెడ్డి, నంద్యాల కోదండ ఆంజనేయ స్వామి దేవాలయం ఈఓ వేణునాథ్ రెడ్డి, సిబ్బంది రమణ, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

– అదనపు కమీషనర్ ఆర్.జి.వి కృష్ణ



అర్జీలు పరిశీలిస్తున్న అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ

**కర్నూలు నగరం,మేజర్ న్యూస్ :** నగరంలో వసతుల కల్పనకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక అదనపు కమీషనర్ ఆర్.జి.వి కృష్ణ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 16 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు,ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్,టిపిఆర్‌ఓ వెంకటలక్ష్మి,టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

## కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలి..!

:– ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి



**కర్నూలు ఎడ్యుకేషన్,మేజర్ న్యూస్ :** జిల్లాలో 2024-25ఆర్థిక సంవత్సరానికి కాపు,బలిజ కులాల వారికి ఇస్తున్న సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి పథకం రుణాల యూనిట్లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయని,మరిన్ని పెంచాలని ఆ సంఘం నాయకులు కోరారు. సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సునాయన ఆడిటోరియంలో జరుగుతున్న ప్రజా పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందచేశారు. సూక్ష్మ,చిన్న,మధ్య తరగతి పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) యూనిట్లు కేవలం 3మాత్రమే కేటాయించారని జిల్లాలోని బలిజ కులస్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని యూనిట్ల సంఖ్యను మరిన్ని పెంచాలన్నారు. దరఖాస్తు చేసుకోవడా నికి చివరి తేదీని ఈ నెల ఆఖరు వర కు పొడిగించాలని,బిసిలకు ఈబిసిల తో సమానంగా వయో పరిమితిని 60సం॥ల వరకు పెంచాలన్నారు. కుల ధృవీకరణ పత్రాలు త్వరగా జారీ చేసేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వారి అభ్యర్థనపై జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా స్పందిస్తూ సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం కర్నూలు నగర అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మన్న,రవికుమార్,సంఘం గౌరవ సలహాదారులు సింగం శెట్టి సోమశేఖర్,ఈశ్వర్ కుమార్ పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో,అంగన్‌వాడి కేంద్రాలలో ఉండే విద్యార్థులందరికి సోమవారం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఓ విశ్వ మోహన్,వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్,డాక్టర్ ప్రతిమ,డాక్టర్ హరితలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల రక్తహీనత నుండి బయటపడతారని,అలాగే కడుపులో ఉండే నులిపురుగులు కూడా బయటకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ సరస్వతి,సూపర్‌వైజర్లు బందయ్య,వెంకట రమణయ్య, నాగమ్మ,ఏఎన్‌ఎం శ్రీదేవి,హెల్త్ కార్యదర్శులు శ్రీదేవి,మహాలక్ష్మి, విజయలక్ష్మి,దీప,రోజా,మేరీకుమారి,విశాలాక్షి,నాగేంద్రమ్మ,దేవి, నాగవేణి,పుష్పలత,శాంతి,అంజలి,ఉపాధ్యాయులు,ఆశాలు,అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.



## బసవేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం



భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డిని సత్కరిస్తున్న అర్చకులు

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో వెలిసిన శ్రీ బసవేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ ఆళ్లగడ్డ యువ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి హాజరయ్యారు. మేళతాళాల మధ్య టీడీపీ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. అనంతరం బసవేశ్వర స్వామి ఆలయంలో భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

– 13459 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు



**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రతి విద్యార్థి చేతుల పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని మండల వైద్యాధికారులు డాక్టర్ భగవాన్‌దాస్, డాక్టర్ వేణుకార్తికేయ, ఎంపీహెచ్ఈవో హుసేన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మహానంది మండలంలోని పాఠశాలల్లో ఉదయం చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు చేతులను బహిర్భూమికి వెళ్ళి వచ్చిన అనంతరం, ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. చేతులను శుభ్ర పరుచుకునే విధానాన్ని ఆశా వర్కర్లు ప్రత్యక్షంగా చూపించారు. వారానికి ఒక్కసారి ఖచ్చితంగా గోర్లు కట్ చేయించుకోవాలని అన్నారు. మండలంలోని తిమ్మాపురం, గాజులపల్లి ఆరోగ్య కేంద్రాల పరిధిలో పాఠశాల విద్యార్థులకు మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 68 పాఠశాలలు, 15 అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 13459 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణకై ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు పీహెచ్ఎన్ అమీనాబీ, ఎంపీహెచ్ఎస్ గిడ్డమ్మ, ఫార్మసిస్టు చంద్రశేఖర్, ల్యాబ్‌టెక్నీషియన్ సికిందర్, సిబ్బంది శ్రవంతి, ఆరుణ, ఏఎన్ఎం హేమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి

## సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల అర్జీలను నాణ్యత గా పరిశీలించి పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజి ఆర్ఎస్) కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి పాల్గొని డివిజన్ నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను సబ్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీతగడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలను నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం కూడా ఉందన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏలోని దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. నందవరం మండలం ముగితి గ్రామానికి చెందిన రంగన్నకు సంబంధించి సర్వే నెం.90ఏ/బినందు 0.73సెంట్ల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించినది. ప్రస్తుతం సదరు భూమి హద్దు రాళ్లు సరిగా లేనందున సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని అర్జీ సమర్పించారు. ఆదోని పట్టణంలో వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, రాత్రి సమయంలో వీధిదీపాలు వెలగడం లేకపోవడంతో దొంగతనాలు జరిగే ప్రమాదాలు ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని 19వ వార్డు శ్రీనివాసాచారి అర్జీ సమర్పించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్య పరిష్కారాల వేదికలో దివ్యాంగులు వచ్చి అర్జీలు సమర్పించుకున్నారు. వారికి వీల్ ఛైర్స్ ఏర్పాటు చేయాలని తస్లీమా అర్జీ సమర్పించారు. అనంతరం పెద్దకడుబూరు మండల కేంద్రానికి చెందిన కుబేర సంబంధించి సర్వే నెం.442లో 4 ఎకరాల భూమి పెద్దల నుండి సంక్రమించినది. సదరు భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, వేణు సూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ చేతన్ ప్రీయా, డిఎల్‌పిఓ నూర్జాహాన్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవి కుమార్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఈఓ వెంకట రమణరెడ్డి, ఆర్టీసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసిన ఎమ్మెల్యే గౌరు చరిత



**కల్లూరు,మేజర్ న్యూస్ :** ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న విక్రాంత్ పాటిల్ ఐపిఎస్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి,తెదేపా సీనియర్ నాయకులు,నందికోట్కూరు టిడిపి ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డిలు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

# విద్యార్థినీలపై యుటీజింగ్ చేస్తే చర్యలు తప్పవు



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీలపై యుటీజింగ్ ఎవరైనా పాల్పడితే అలాంటి విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం ఎస్.ఐ శివాంజుల్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రాలయం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ, సైబర్ నేరాలు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, ఆఘాయిత్యాలకు పాల్పడడం వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. రోడ్డు భద్రత వంటి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దతుంబళం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## – ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి

**ఆదోని, మేజర్‌న్యూస్ :** పెద్దతుంబళం గ్రామ అభివృద్ధికి మా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. సోమవారం పెద్దతుంబళం గ్రామంలో ప్రేమ్ మినిస్టర్ రైసింగ్ ఆఫ్ స్కూల్స్ సెంట్రల్ స్కీం ద్వారా జెడ్పి పాఠశాల అదనపు గదుల అభివృద్ధి కార్యక్రమం, కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజిఎస్ పథకం ద్వారా విడుదలైన నిధులతో గ్రామంలో సిసి రోడ్డు పనులను సంబందించిన అభివృద్ధి కార్యక్రమాలను ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెద్దతుంబళం గ్రామ కూటమి



బేల్దార్ పని చేస్తున్న మారిన ఎమ్మెల్యే

నాయకులంతా ఐక్యంగా గ్రామంలోని సమస్యలను తెలుసుకొని సిసి రోడ్డు కావచ్చు, డ్రైనేజీ కావచ్చు, వీధి దీపాలు, తాగునీరు, తదితర సదుపాయాలు గ్రామ ప్రజలకు అందించడమే ధ్యేయంగా నాయకులంతా కృషి చేస్తున్నారని, వారికి ఏ సహకారం కావాలన్నా ఎమ్మెల్యేగా నేను ముందుండి వారికి అన్ని రకాలుగా తోడుంటానని తెలియజేశారు. పెద్దతుంబళం గ్రామంలో ఇక వైఎస్సార్సిపి ఆటలు సాగవని, వైసీపీ కార్యకర్తలు తమ దౌర్జన్యాలు ఆపాలని ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని, అభివృద్ధి పనులకు వైఎస్సార్సిపి అడ్డు వస్తే ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి..!

## ః– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో టుటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ



మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాల న్నారు. మొత్తం 113 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

# పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న విద్యుత్ అధికారి

**కర్నూలు టౌన్,మేజర్ న్యూస్ :** పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ పి ఓబులేసు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి శేషాద్రిలు అన్నారు. సోమవారం నగరంలోని స్థానిక విద్యుత్ భవన్‌లోని సూపరింటెండెంట్ ఇంజనీర్ వారి కార్యాలయంలో విద్యుత్ అధికారులు మరియు సోలార్ వెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వినియోగదారులకు మరింత చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా ప్రధాన కూడలిలో మరియు కాలనీల్లో ప్రతిరోజు స్టాల్స్‌ని ఏర్పాటు చేసి వినియోగదారులకు స్పాట్‌లో రిజిస్ట్రేషన్ చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాగవులు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు,సోలార్ వెండర్లు పాల్గొన్నారు.

# అక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్దీకరణకు దరఖాస్తు చేసుకోండి

## – ఆర్డీఓ భరత్ నాయక్



మాట్లాడుతున్న ఆర్డీఓ

**పత్తికొండ, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్దీకరణకు సంబంధించి, జిఓ నెం. 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యూలరైజేషన్ స్కీం 2025పేరిట భూముల క్రమబద్ధీకరణ కోసం ఈ సంవత్సరం డిసెంబరు 31వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీఓ భరత్ నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తారు. కావున కుటుంబంలోని మహిళలే అర్జీలను సమర్పించవలెను, రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన లబ్ది దారుల జాబితాను గ్రామ వార్డు కార్యాలయాల్లో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలు స్వీకరించి తహశీల్దార్లు తుది జాబితాను, ఆర్డీఓ పత్తికొండ వారికి సమర్పిస్తారు. సబ్ డివిజన్ లె వల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్ 30రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చు. అర్హుల జాబితా ఖరారైన తరువాత ఆ వివరాలను తహశీల్దార్లు ఆ ప్రాంత సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతుకు అన్ని విధాలా
ఉపయోగపడేందుకే ప్రత్యేక గుర్తింపు
నమోదు సంఖ్య : మండల వ్యవసాయ
అధికారి కృష్ణా రెడ్డి



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సమన్వయంతో రైతుల కొరకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల వ్యవసాయ అధికారి కృష్ణా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తంగడంచ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక గుర్తింపు నమోదు సంఖ్య కార్యక్రమంపై గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య రైతులకు ఇవ్వడం వల్ల అర్హులైన రైతులను గుర్తించడానికి ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడిలు, పంటల భీమా, తదితర పథకాలు పొందవచ్చని అన్నారు. రైతు పథకాలైన పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంటల రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడి పనిముట్లు, తదితర వాటిని పొందవచ్చని అన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతుకు ఈ విశిష్ట సంఖ్య ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్నందున ప్రతి రైతు వారి ఆధార్ నెంబరుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్, భూ రికార్డులతో నమోదు చేయించుకోవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సూర్య



# ప్రజాసమస్యల పరిష్కర వేదికకు ప్రజాస్పందన కరువు


పరిష్కర వేదికలో దరఖాస్తు లు స్వీకరిస్తున్న ఇంచార్జి తహసీల్దార్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో ప్రజా సమస్యల పరిష్కర వేదికకు ప్రజల స్పందన కరువైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కరానికి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ప్రజల నుండి స్పందన రోజురోజుకు కరువైందని ప్రజలు పెదవీవిరస్తున్నారు. దీనికి కారణం ప్రజలనుండి రకరకాల కారణాలు చెప్పుతున్నారు. నిర్ణత సమయంలో దరఖాస్తులకు పరిష్కరం చూపకపోవడం, అధికారుల చుట్టూ తిరిగి వేసారిన మనసులు, తుతు మంత్రంగాఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం, పట్టించుకొని అధికారులు, ఈ కార్యక్రమంపై అధికారులకు కొరవడిన నిర్లక్ష్యం, కుప్పలు తెప్పలుగా పేరుకోపోయి న దరఖాస్తులు, నెలలు, సంవత్సరాలు గడచినా పరిష్కరం నోచుకోక పోవడం వల్ల ప్రజలకు ఈ కార్యక్రమంపై తీవ్ర అసంతృ ప్తి వ్యక్తం చేస్తున్నారు,అందుకే ప్రజా నుండి స్పందన కరువైందని ప్రజలు తెలిపారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలం రెండు దరఖాస్తులు వచ్చినట్టు ఇంచార్జి తహసీల్దార్ పురుషో త్తమ్ముడు తెలిపారు. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్, ఆర్.డబ్లీవ్. ఎస్, శిశు సంక్షేమ అధికారులు, హౌసింగ్ అధికారులు తప్ప విద్యా, వైద్యం, వెలుగు, విద్యుత్, రోడ్డు రవాణా, ఇరిగేషన్, మైనింగ్, ఉపాధి వంటి ఆయా శాఖల అధికారులు గైహాజరయ్యారు.

# కొండగుట్టకు పట్టాదారు పాసు పుస్తకాలు..!

(మొదటిపేజి తరువాయి..)

అలాగే మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలోని సర్వే నెంబరు603/ఏ1 నందు 103,89. ఎకర ములప్రభుత్వ భూమి కలదు.అదే గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ. రైతు సంఘం జిల్లా నాయకుడిని చెప్పుకుంటున్న కమ్మరి పరమేశ్ అనే వ్యక్తి గత 15 సంవత్సరాల నుండి తన పలుకుబడితో స్థానిక రెవెన్యూ అధికారులు అండతో తన కుమారుడైన కమ్మరి శ్రీనివాసులు పేరు మీదుగా అదే సర్వే నంబర్603/ఎ1లో 2 ఎకరాల పట్టాదార్ పాసు పుస్తకం పొందినట్లు ఆయన తెలిపారు.పట్టాదార్ పాస్ పుస్తకం ఖాతా నెంబరు 612, అలాగే తన కుమార్తె అయిన కమ్మరి ధనలక్ష్మి పేరు మీదుగా అదే సర్వే నంబర్ లో 2 ఎకరాలు, పట్టాదార్ పాసు పుస్తకం ఖాతా నంబరు: 593, అక్రమ పట్టాదార్ పాసు పుస్తకాలు పొంది ఏకంగా ప్రభుత్వ వ్యవసాయ పథకాలైన రైతు భరోసా, పిఎం కిసాన్, సబ్సిడీ ఎరువులు,విత్తనాలు,పంట నష్ట పరిహారం, బ్యాంకుల ద్వారా, క్రాప్ లోన్స్ పొందడం


ఫిర్యాదు చేసిన ఎఫ్. ఆర్. టి. ఐ.జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న

జరిగిందని ఆయన ఆరోపించారు. అలాగే కమ్మరి ధనలక్ష్మి, కమ్మరి శ్రీనివాసులు, కూడా పత్తి,మిరప,పంటలు వేసినట్లు ఆర్ బి కె కార్యాలయం సిబ్బంది. వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరిస్తూ ఇప్పటివరకు సుమారుగారూ 10 లక్షల వరకు అక్రమంగా ప్రభుత్వం నుండి లబ్ధి పొందుటకు వారు కూడా రైతులకు సహకరించారని ఆయన తెలిపారు.జిల్లా మెజిస్ట్రేట్ ఈ అవినీతిపరులపై దృష్టి సారించి సర్వే నంబర్ 603/ఏ1 పుస్తకాలు మంజూరు చేసిన పెద్దకడుబూరు మండల రెవెన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొండ గుట్ట లో మిరప. పత్తి. పంట. వేసినట్లు క్రాప్ నమోదు చేసి ధ్రువీకరించి రైతు భరోసా, పిఎం కిసాన్,సబ్సిడీ ఎరువులు,విత్తనాలు, పంట నష్ట పరిహారం, క్రాప్ లోన్స్ పొందుటకు కారకులవుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది పై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ ను కోరారు. కొండ గుట్టలోభూమి లేకున్నా కొండగుట్టలో భూమి ఉన్నట్లు పట్టాదార్ పాస్ పుస్తకాలు పొంది, ప్రభుత్వ సబ్సిడీలు లక్షల రూపాయలు పైగా అక్రమంగా పొందిన కమ్మరి పరమేష్, కొడుకు, కుమార్తె, శ్రీనివాసులు, ధనలక్ష్మి లపై చీటింగ్ కేసు నమోదు చేసి పట్టాదార్ పాసు పుస్తకాలును రద్దు పరచి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన జాయింట్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

# సీసీ రోడ్ల నిర్మాణ పనులను అకస్మీకంగా తనిఖీ చేసిన మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని కైప గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి రూ. 2కోట్ల నిధులు కేటాయిండం జరిగింది. దాంతో కైప గ్రామంలో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టగా సోమవారంనాడు మంత్రి బి.సి నిర్మాణ పనులనున అకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన రోడ్లను నిర్మించాలని గుత్తేదారులకు తెలిపారు.



# విద్యార్థినీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఉపాధ్యాయ బృందం


ఆర్థిక సహాయం అందజేస్తున్న హెచ్.ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రవిప్రకాష్, చెన్నయ్యలు

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండల కేంద్రమైన దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ భవిత అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రవిప్రకాష్ , చెన్నయ్య, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థినీ కుటుంబానికి పాఠశాల తరపున రూ. 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థినీ భవిత అనారోగ్యంతో మృతి చెందడం చాలా విషాదకరమని చదువులో మంచిగా చురుగ్గా ఉండేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, రవిప్రకాష్ , చెన్నయ్య, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నులిపురుగు నిర్మూలన మాత్రలు పంపిణీ

**ఆత్మకూరు, మేజర్న్యూస్:** విద్యార్థులు నులిపురుగులతో ఇబ్బంది పడకుండా నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని బైర్లూటి పిహెచ్సి వైద్యులు డాక్టర్పవన్ కుమార్, గోపాల్లు అన్నారు. సోమవారం నులిపురుగుల నిర్మూలనంలో భాగంగా బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామన్నారు.వైద్యులు మాట్లాడుతూ నులిపురుగులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని , నులి పురుగుల వల్ల విద్యార్థులకు కడుపునొప్పి రావడం, సన్నబడడం లాంట ి వి జరుగుతాయని అన్నారు.విద్యార్థులు సరైన పౌష్టికాహారాన్నితీసుకోవాలని, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారంతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక ఆహారాన్ని అందించాలన్నారు. నులిపు రుగులు ఉన్నట్లు తెలిస్తే అల్బెండజోల్ మాత్రలను వాడాలన్నారు. అంగన్వాడీలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నులిపురుగులపై అవగాహన కల్పింస్తు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వాడేలా చూసి నులిపురుగులను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. సిహెచ్ఓ కుదుష్బాష, సూపర్వైజర్ రవణమ్మ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలేసుని ఉత్సవ పల్లకికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పారువేట ఉత్సవాలలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంవి నగర్కు చేరుకున్న అహోబిలేసుని ఉత్సవ పల్లకికి పలువురు పూజలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం చేరుకున్న పల్లకికి ఎంపీపీ గజ్జల రాఘవేంద్రరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పల్లకిలో కొలువు దీరిన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాద వరద స్వాములకు పూజలు నిర్వహించారు. అలాగే వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, రిజిస్టర్ కార్యాలయ అధికారులు, విద్యాశాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు పూజలు నిర్వహించారు. అలాగే డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్న పల్లకికి డి.ఎస్.పి ప్రమోద్ కుమార్, సిఐలు మురళీధర్ రెడ్డి, చిరంజీవి, ఎస్ఐలు హరిప్రసాద్, నగినా, పోలీస్ సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవపల్లకి చింతకుంటగ్రామం చేరుకుంది.

# గాజులదిన్నె ప్రాజెక్టు కింద జోరుగా వరినాట్లు


గాజులదిన్నె ప్రాజెక్టు కింద వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నీటి వసతి ఉన్న రైతులు తమ వ్యవసాయ పొలాల దగ్గర వరినాట్లు వేస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద పంట పోలాలలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 700 ఎకరాలు వరి నాట్లు వేస్తున్నారు. రైతులు బావులు, బోర్ల దగ్గర వరి నాట్లను వేసు న్నారు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్ట్ ఎగువ, దిగువ ప్రాంతలలో వరి నాట్ల సాగు జోరందుకుంది.సోనామసూర్, జిలకర సోనా, 65 డీపీ, తెల్ల హంస, కర్నూలు సోనా, రకాలను సాగు చేస్తున్నారు. పత్తి పంట ఎండ వేడికి దెబ్బతినడంతో పత్తి పంటను తీసివేసి వరిని సాగు చేస్తున్నారు. గాజులదిన్నె, ఐరన్బండ, హెచ్ కైరవాడి, వేముగోడు. పుట్టపాశం, ఎన్నెకండ్ల, గోనెగండ్ల గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తున్నారు.

# రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు..

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి విశిష్ట గుర్తింపు సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందనీ మండల వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య సొంత భూమిగల రైతులుగుర్తించడంలో తోడ్పడి, వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంనుండి వచ్చే వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందన్నారు.

**భూ ఆధారిత పథకాలు ఇలా ఉన్నాయి.. :** పీఎం కిసాన్ చెల్లింపులు ,అన్నదాత సుఖీభవ,పంటల భీమా ,పంట రుణాలపై వడ్డీ రాయితీ ,రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు,రాయితీ పై సూక్ష్మ పోషకాలు,సూక్ష్మసేద్యం పై రాయితీ,పంట రుణాలు,పెట్టుబడి సాయం..తదితర పథకాలు నేరుగా రైతు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు.నమోదు విధానం రైతులు వారి యొక్క ఆధార్ కార్డు,ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఆన్లైన్ 1బి పట్టా, రైతు పట్టాదారు పాస్ బుక్ తీసుకొని గ్రామంలో రైతు సేవా కార్యాలయంలో సిబ్బందిని కలిసి పైవన్నియు జిరాక్స్ కాపీలు సమర్పించాలని తెలిపారు.

# సమస్యపై విచారణ చేసి పరిష్కరిస్తాం

**పాములపాడు, మేజర్ న్యూస్ :** రైతుల నుంచి సమస్యలపై వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహ సిల్దార్ సుభద్రమ అన్నారు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముగ్గురు రైతుల నుంచి అర్జీలు వచ్చాయన్నారు పాములపాడు గ్రామ పొలిమేర లోని భూముల కొలతలు వేసి ఆన్లైన్ నమోదు కోసం రైతులు అర్జీలు ఇచ్చారని ఆమె తెలిపారు మండల కేంద్రంలోని రైస్ మిల్ నుండి దుమ్ము ఎక్కువగా వస్తుందంటూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చుట్టుపక్కల నివాసాలు ఉన్న ప్రజలు ఎంపీడీవో చంద్రశేఖర్ కు అర్జీలు ఇచ్చారు.

# అటవీశాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**గడివేముల ,మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా అటవీ శాఖ పాణ్యం అడవి రేంజ్ పరిధిలో ఎస్సీ సుబ్బరాయుడు వారి ఆధ్వర్యంలో అడవులను అగ్ని బారి నుండి కాపాడటం మరియు పుణ్యప్రాణులను రక్షించడం మొదలగు అంశాలను మీద ప్రజలకు అవగాహన కల్పించడానికి గడిగరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రతాప్ బృందం వారిచే కళా జాతర నిర్వహించడం అయినది అనంతరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజ యలక్ష్మి మాట్లాడుతూ అడవులలో చెట్లను నరకరదని చెట్లు పెంచాలని అడవి జంతువు లను కాపాడాలని చూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి ఉప సర్పంచ్ గోదాప్రసాద్ విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అబ్దుల్ కలాం, జమాల్ వలి ప్రొటెక్షన్ వాచర్స్ మరియు గ్రామ పెద్దలు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అబాకస్ పోటీలకు విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ రెడ్డి

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన విశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల ఫిబ్రవరి 9వ తేదీన విజయవాడలో జరిగినటువంటి అబాకస్ ( మ్యాథమెటిక్స్ ) రాష్ట్రస్థాయి కంప్యూటర్స్ పోటీలలో విశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను చాటారు. కుందన, ( 2వ,ర్యాంకు జూనియర్ లెవెల్‌లో) జి శంకర్ 1వ ర్యాంక్ (జూనియర్ లెవెల్లో) సాధించి దేశ రాజధానిఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌శ్రీనాథ్ రెడ్డి ,హెడ్ మిస్సెస్ వరలక్ష్మి విద్యార్థులకు అభినందించారు .శిక్షణ ఇచ్చినటువంటి ఉపాధ్యాయులను అభినందించారు, శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ , మా పాఠశాలలో, అన్ని రకాల కల్చర్ యాక్టివిటీస్,ఎడ్యుకేషన్ కు సంబంధించినటువంటి పోటీలకు , క్రీడలకు, ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం



విద్యార్థులకు నులిపురుగు మందులను వేస్తున్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** వ్యక్తి గత పరిశుభ్రత ఎంతో అవసరం అని ప్రభుత్వ వైద్యురాలు రుక్సానా అన్నారు. సోమవారం గోనెగండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగు మందులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు రుక్సానా మాట్లాడుతూ నులిపురుగు కలిగిఉన్న పిల్లలు అనేక హానికరమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడ తుంటారని అన్నారు. రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవుట, బలహీనత మరియూ ఆందోళన, కడుపునొప్పి వికారం, వాంతులు, అతిసార, మలంలో కర్తం చర్మదద్దుర్లు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. నిలిపురుగు నివారణ మందులను 1నుంచి 5 ఏళ్లు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో, 6 నుంచి 19 ఏళ్ల పిల్లలు పాఠశాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు నులిపురుగుల మందు అల్బెండాజోల్‌ను ఆందజేశారు. గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, ఎంపీహెచ్వి హనుమంతు, పరమేష్, బతకన్న, విజయభారతి, పరిమళకుమారి, ఏఎన్ఎం. ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## గోవర్ధనగిరిలో నులిపురుగుల మందులు పంపిణీ



**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** గోవర్ధనగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులి పురుగుల కార్యక్రమంమదర్‌పురం ఎంపీపీ పాఠశాల నందు డాక్టర్ శ్రీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం గోవర్ధనగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోని బింగి దొడ్డి,గోవర్ధనగిరి శ్రీరంగాపురం, లక్ష్మీనగరంలోని అన్ని పాఠశాలల్లో మరియు అంగన్వాడి కేంద్రాలలో టోటల్ 3,097 మంది విద్యార్థిని విద్యార్థులకుగాను 2,891 విద్యార్థులకు అందించడం జరిగిందని దాదాపు 93% శాతం విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. మిగిలిన విద్యార్థులకు 17వ తారీఖున మళ్లీ నులి పురుగులు మందులను వేయడం జరుగుతుందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిమేల్ సూపర్వైజర్ ఎస్. నాగలక్ష్మి, మరియు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యానికి అల్బెండజోల్ తప్పనిసరి

**-జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ.**



బాల బాలికలకు అల్బెండాజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** పిల్లల బలవంతమైన ఆరోగ్యనికి అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల వైద్య సిబ్బంది, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది లతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బాల బాలికలకు ఎంపీడీఓ అల్బెండాజోల్ వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల బాలికల బలవంతమైన ఆరోగ్యనికి అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ.రాణెమ్మ, ఈ ఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు.

## శివదీక్షతో ఆధ్యాత్మికత

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** శివదీక్షతో ఆధ్యాత్మికత పెరుగుతుందని గ్రామీణ సామాజిక వైద్యులు, విశ్వబ్రహ్మ హెల్త్ కేర్ సొసైటీ అధ్యక్షులు జాలవాడి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారంమండల పరిధిలోని బోడబండ గ్రామంలో జరిగిన శివ పూజ కార్యక్రమంలో పాల్గొని శివ భక్తులతో కలసి పూజలు చేశారు. శివ స్వాములకు సబ్బులు, టూత్ పేస్ట్, టూత్ బ్రష్ లను అందించారు. ఐహిక సుఖములను పొందటానికి, జనన రూపమైన సంసారచక్రం నుంచి మొక్షాన్ని పొందటానికి దీక్షలు ఉపకరిస్తాయి. పార్వతి మొదలు అర్జునుని వరకు శివ దీక్ష స్వీకరించి కోర్కెలను సాధించుకున్నారని, ప్రతి ఒక్కరు దైవ చింతన, సామాజిక సేవలను అలవర్చుకోవలన్నారు. శివస్వాములు రామచంద్ర, నరసింహులు, ప్రహ్లాద,నాగేష్ పాల్గొన్నారు.



## భూ రిజిస్ట్రేషన్ భూ ఆధార్ నమోదు చేసుకోండి .. ఏ డి విజయ్ కుమార్



**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల కేంద్రంలోనిరైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడిఏ విజయకుమార్ వ్యవసాయ అధికారి పీర్ నాయక్ అన్నారు ఈ సందర్భంగా సోమవారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతు రైతులు సొంత భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు, రైతు సేవాకాంద్రాలకు వెళ్లి రైతు సోదరులు భూమి నమోదు చేసుకోవాలని దీనికి ఆధార్ లాగారిజిస్టర్ చేసుకున్న రైతులకు 11 అంకెల ఒక నెంబర్ వస్తుందిఈ నంబర్ వలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఇన్పుట్ సబ్సిడీలు, రాయితీలు, పురుగుమందులు మరియు ఎరువులు, వ్యవసాయం సంబంధించిన పనిముట్లు మొదలగు సౌకర్యాలు పొందవచ్చు.. అని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మరియు గ్రామ రెవిన్యూఅధికారులకసమన్వయంతో రైతులుఫార్మర్ రిజిస్ట్రీ కి కావలసిన పత్రాలు. రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఏవో కోరారుఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మండల తాహాసిల్దార్ శ్రీనివాసులు ఏ ఈ ఓ అశోక్, వీఆర్వో లు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

### నులిపురుగుల నివారణ

## మందుల పంపిణీ

**చాగలమర్రి , మేజర్ న్యూస్:** గ్రామాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దూరు గ్రామంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన మండలంలో మొత్తం పాఠశాలలో 9029 పిల్లలు ఉండగా 8901 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మందులను చిన్నారులకు ఇస్తున్న సిబ్బంది

### ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్

## మాత్రలు వేయించాలి

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** 1 నుంచి 19 సంవత్సరాల్లోపు ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యులు ద్వీపా నాగవేణి, మహమ్మద్ బేగ్, విజయేంద్ర, జబీర్ బాషాలు తెలిపారు. సోమవారం కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆయా గ్రామాల్లో ఉన్న చిన్నారులకు జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనలో ఉండే నులి పురుగులను నివారించేందుకు, రక్తహీనతను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ మాత్రలు నులి పురుగుల నివారణకు తోడ్పాటు అందిస్తాయని అన్నారు. గ్రామాల్లోని ప్రతి చిన్నారికి ఈ మాత్రలు మింగించాలని కోరారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ దిగుబడులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న దృశ్యం

**చాగలమర్రి , మేజర్ న్యూస్:** ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పండించిన దిగుబడులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ పెద్దవంగలి యూనిట్ ఇన్చార్జ్ కదిరి భాషా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి పండించిన ఆకుకూరలు, కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రొత్సహించాలని తెలియజేసారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సేంద్రీయ పద్దతిలో సాగు చేసిన ఆకుకూరలు,కూరగాయలను విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్పిలు బూర్గుల భాష ,లక్ష్మయ్య, రవి, లక్ష్మినరసమ్మ, సురేష్ లు పాల్గొన్నారు.

## కెజె.రెడ్డి పై కేసు నమోదు

**కర్నూల్ క్రైమ్ మెజర్ న్యూస్:** ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కె.జె.రెడ్డి ముప్పా రాజశేఖర్ అనే వ్యక్తిని అతని భార్యను బెదిరించాడని మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కె.జె రెడ్డి పై కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కెజె.రెడ్డి ఆరు నెలల క్రితం ముప్పా రాజశేఖర్ స్నేహితుడి వద్ద పొలాన్ని కొని కొంత అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఆ స్నేహితుడు ప్రస్తుతం నేను పొలం అమ్మడం లేదని,రేటు సరిపోలేదని నువ్వు త్వరగా డబ్బులు ఇవ్వవని,నేను నీకు పొలాన్ని అమ్మడం లేదని తెలిపాడు. దీంతో కోపోద్రికుడైన కెజె.రెడ్డి,రాజశేఖర్‌కు ఫోన్ చేయగా అతను ఫోన్ ఎత్తకపోవడంతో కెజె.రెడ్డి తన ఎజెంట్లను ఏ.క్యాంపులో ఉన్న ముప్పా రాజశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద వెళ్లి అతని నీ భర్త డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో తనకు ఎలాంటి సంబంధం లేదని అయిన తమను కెజె.రెడ్డి ,ఎజెంట్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సోమవారం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు.. మూడవ పట్టణ ఎస్సై మన్మధ విజయ్ కెజె.రెడ్డి,అతని ఎజెంట్ల పై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..

**– ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారుల గైర్హాజరు**

**– నామమాత్రంగానే కొనసాగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక**



కార్యక్రమానికి హాజరైన ఎంపిడిఓ, తహశీల్దార్

**పత్తికొండ, మేజర్ న్యూస్:** ప్రజా సమస్యలను పరిష్కరించాలనే దిశగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసింది. ప్రతి సోమవారం మండలంలో ఉన్న వివిధ శాఖల అధికారులు అందరూ హాజరై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలనుండి వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పరిశీలించి పరిష్క రించాలన్నా రు. ఉన్నతాధికారులు ఆదేశాలు జారి చేసిన మండల అధికారులు ప్రభుత్వ ఆదేశా లను బేఖాత ర్ చేస్తుండడం గమనార్హం. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమావేశ భవనంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ, తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారి, ఏఈ, ఇరిగేషన్ శాఖ అధికారి ఏఈ, అంగన్‌వాడి సూపర్‌వై జర్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్, వెలుగు సిబ్బంది, ఆర్ఐ, విఆర్ఓలు మాత్రమే హాజరయ్యారు. మిగతా వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నామమాత్రంగానే కొనసాగి స్తున్నారని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవడం వల్లనే వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరువుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల మండల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

సూర్య



# చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

► రగ్బీ ఉమెన్స్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.2లక్షల నగదు బహుమతులను అందజేసిన కర్నూలు కలెక్టర్

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా పేర్కొన్నారు. మినిస్ట్రీ యూత్ అఫైర్స్,స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా,ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించిన అస్మిత రగ్బీ ఉమెన్స్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీలకు సోమవారం కలెక్టరేట్‌లోని సునాయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ప్రోత్సాహక నగదు బహుమతులను అందచేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం,మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ అలవడడం,ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు వంటి సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి నంద్యాల ఆర్జీఎం కళాశాలలో జరిగిన పోటీల్లో అన్ని ప్రభుత్వ,ప్రైవేటు కెజీబివి,ఇంజనీరింగ్ డిగ్రీ కళాశాల జట్లు పోటీ పడ్డాయని ఇందులో పోటీ పడి కంబాలపాడు,దిన్నెదేవరపాడు,లక్ష్మాపురం,ఆళ్లగడ్డ, ఏపిఎస్ డబ్ల్యూర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినులు రూ. 2లక్షలు గెలుచుకోవడంతో కలెక్టర్ వారిని అభినందించి నగదు బహుమతులను విద్యార్థినీలకు అందచేశారు. అనంతరం గురుకుల పాఠశాలలో 5వ తరగతి,ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల కోఆర్డినేటర్ శ్రీదేవి,డిఎస్‌డిఓ భూపతిరావు,ఏపి రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందచేస్తున్న కలెక్టర్

## పాత్రికేయులపై నోరుపారేసుకున్న
# సస్పెండ్ సబ్ రిజిస్ట్రార్

► సస్పెండైనా అబ్దుల్ సత్తార్ నంద్యాల కార్యాలయంలో తిష్ట
► కొందరు స్టాప్ రైటర్స్... కార్యాలయ ఉద్యోగులతో రహస్య సమావేశం
► ఇదేంటని ప్రశ్నించిన విలేకరులపై బూ...పురాణం
► నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏమి జరుగుతోంది!
► పాత్రికేయుల తిట్ల...బూ...పురాణంపై ఉన్నతాధికారుల దృష్టికి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాలలో సస్పెండ్ అయిన సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ పాత్రికేయులపై నోరు పారేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ కోర్టులో ఉన్న ఒక స్థలాన్ని నంద్యాలలో రిజిస్ట్రేషన్ చేయడంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు చేసిన విషయం పాఠకులకు విధితమే. సస్పెండ్ అయిన అబ్దుల్ సత్తార్ నంద్యాల కార్యాలయంలో తిష్టవేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. కొందరు స్టాప్ రైటర్స్, మరికొందరు కార్యాలయ ఉద్యోగులతో ఆయన కార్యాలయంలోపల రహస్య సమావేశం నిర్వహిస్తున్న విషయం బయటపడింది. ఇదేమిటని ప్రశ్నించిన ఒక పాత్రికేయుడితో విలేఖరులపై తిట్ల... బూ..పురాణం అందుకున్నారు. అసలు నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాత్రికేయుడిపై అబ్దుల్ సత్తార్ తిట్ల.. బూ.. పురాణంపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సస్పెండ్ అయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏదైనా పని ఉంటే వెళ్లడాన్ని ఎవరూ తప్పు పట్టరు. అలా కాకుండా ఆయన కార్యాలయంలోని లోపల గదిలో కొందరు స్టాప్ రైటర్లతో పాటు మరికొందరు కార్యాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించడం ఆ శాఖలో పెద్ద దుమారాన్ని రేపుతోంది. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా సేవలు అందించే పాత్రికేయులపై పరుష పదజాలంతోపాటు పత్రికల్లో రాయలేని విధంగా తిట్ల ... బూ... పురాణంపై పాత్రికేయులు మండిపడుతున్నారు. సస్పెండ్ అయిన అబ్దుల్ సత్తార్ నంద్యాల కార్యాలయం కేంద్రంగా తన హవాను కొనసాగిస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

నంద్యాల సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో సస్పెండ్ అయిన అబ్దుల్ సత్తార్ సోమవారం ఉదయం ప్రత్యక్షమయ్యారు. కార్యాలయం లోపల గదిలో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ -2 రాజా చంద్రమౌళి మరియు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గోపాల్‌తో ఆయన సమావేశమయ్యారు. అంతకుముందు కొందరు స్టాంప్ రైటర్లు ఆయనతో మాట్లాడి వెళ్లినట్లు తెలుస్తోంది. అబ్దుల్ సత్తార్ కార్యాలయంలో ఉన్నట్లు బయటకు పొక్కడంతో సోషల్ మీడియాలో ఇదే అంశంపై ఒక పోస్టింగ్ వచ్చింది. అక్కడే ఉన్న సీనియర్ పాత్రికేయుడు ఒకరు అబ్దుల్ సత్తార్ వద్దకు వెళ్లారు. అప్పటికే ఆయన పాత్రికేయులపై పత్రికల్లో రాయలేని విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని విన్న సీనియర్ పాత్రికేయుడు ఇదేమిటని ప్రశ్నించారు. ఏదైనా వార్తపై అభ్యంతరాలు ఉంటే మరో రూపంలో వెళ్ళాలని, అలా కాకుండా పాత్రికేయులను పరుష పదజాలంతోపాటు అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. ఇదే సమయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. పాత్రికేయులను అసభ్యపదజాలంతో దూషిస్తూ కార్యాలయం లోపల అబ్దుల్ సత్తార్ తన ఆర్భాటాన్ని ప్రదర్శించారు. సస్పెండ్ అయిన తర్వాత తాను కార్యాలయానికి రావడం ఇది రెండవసారి అని వాస్తవాలను తెలియకుండా సోషల్ మీడియాలో పోస్టు చేసిన పాత్రికేయులపై ఆయన విరుచుక పడ్డారు. పాత్రికేయులపై అబ్దుల్ సత్తార్ తిట్ల, బూ.. పురాణం అంశం ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో అబ్దుల్ సత్తార్ అలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని పాత్రికేయులు తీవ్రంగా ఖండిస్తున్నారు. అసలు అబ్దుల్ సత్తార్ కార్యాలయానికి ఎందుకు వచ్చారు. ఆయనకు కార్యాలయంలో రాచమర్యాదలు అందించడం తదితర అంశాలు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.



సస్పెండ్ అయిన అబ్దుల్ సత్తార్






నంద్యాల సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం

# కుక్కల దాడిలో.. జింక మృతి

## పోస్టుమార్టం చేసిన వెటర్నరీ డాక్టర్

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాగులటి గ్రామంలో ఆదివారం సాయంత్రం కుక్కల దాడితో జింక మృతి చెందినట్లు గ్రామ స్తులు తెలిపారు గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పొలాల నుండి గ్రామంలోకి వస్తుండగా ఊర కుక్కలు వెంటపడి జిం కను చంపాయి దీనిని రైతులు గమనించి ఫారెస్ట్ ఆఫీసర్ కు సమా చారం ఇవ్వగా అప్పటికే జింక మృతి చెందినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు మండల కేంద్రంలోని వెటర్నరీ డాక్టర్ సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు కుక్కల దాడిలో తీవ్ర గాయాలు రక్తస్రావం కావడం తో మృతి చెందినట్లు డాక్టర్ సాయినాథ్ రెడ్డి తెలిపారు .ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ గార్డ్ శ్రీనివాసులు, వెటర్నరీ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇళ్ల స్థలాలకై కదం తొక్కిన నిరుపేదలు

- ఎంపిడీఓ కార్యాలయం ముట్టడి
- స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు
- భూకబ్జాదారుల చేతిల్లో ఉన్న భూములను పంచాలి



నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు, ప్రజలు

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ సమీపంలో చాబోలు, 80 బన్నూరు, సిద్ధేశ్వరం గ్రామాల దళిత, గిరిజనులకు ప్రతి కుటుంబానికి 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉదృతం చేస్తామని సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు పేర్కొన్నారు. రమేష్ బాబు ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నుంచి వందల మంది నిరుపేదలు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ముట్టడి చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామ్మూర్తి, జిల్లా నాయకులు రమేష్ బాబులు మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలో వందలాది మంది ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు పూరిగుడిసెల్లో, అద్దె భవనాల్లో నివసిస్తున్నారని గత ప్రభుత్వంలో వీరికి న్యాయం జరగలేదని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా ఇంకా గూడు కోసం పేద ప్రజలు ఆందోళన బాటపట్టడం సిగ్గుచేటని అన్నారు. అధికార ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. చాబోలు గ్రామస్తులు గత ఐదు సంవత్సరాల నుంచి మా ఇల్లులు కూలిపోయే ప్రమాదం ఉందని మాకు గూడు కల్పించండి అని వేడుకుంటున్నా స్పందించడం లేదని అన్నారు. 80 బన్నూరు గ్రామంలో ఉన్న గిరిజనులు అరసెంటులో నాలుగు కుటుంబాలు జీవిస్తున్నారని ఇది ఎంత దుర్భరంగా ఉంటుందో అధికారులు తెలుసుకోవాలని అన్నారు. సిద్ధేశ్వరం గ్రామ గిరిజనులు ఎక్కడ ఉన్నారో ఎలా ఉన్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం గొప్పలు చెప్పేకుంటూ గిరిజనులకు, దళితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప వాటిని నెరవేర్చడం లేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో వీరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని అనేక రూపాల్లో అర్జీలు ఇస్తూ ఆందోళనలు చేస్తున్నా స్పందించడంలో విఫలం చెందారని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా అసైన్మెంట్ భూములు ఉన్నాయని గ్రామకంఠ భూములు అక్రమార్కులు ఆక్రమించుకొని పొలాలు చేసుకుని రియలెస్టేట్ వ్యాపారం చేస్తున్నారని వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాంటి భూములను తక్షణమే అధికారులు గుర్తించి నిరుపేదలైన పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని అన్నారు. జూపాడుబంగ్లా జగనన్న కాలనీ పక్కలో అనువైన చోట మూడు గ్రామాల ప్రజలకు దాదాపు 200 మంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబానికి మూడు సెంట్ల స్థలం కేటాయించాలని వారు తహశీల్దార్‌ను కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు.

**స్పందించిన తహశీల్దార్ :** సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు చేస్తున్న పోరాటం గురించి తహశీల్దార్ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు తెలిపినట్లు సిపిఐ నాయకులు తెలిపారు. త్వరలో జూపాడుబంగ్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు మాట్లాడుతూ మీ సమస్యలను డివిఎంసి మీటింగ్‌లో కలెక్టర్‌కు విన్నవించానని అన్నారు. ఐటిడిఏ అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నందికొట్కూరు పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ మండల నాయకులు నరసింహ, శ్రీరాములు, నాగన్న, వెంకటరమణ, చాబోలు నాయకులు వెంకటరమణ, నాగన్న, 80 బన్నూరు గిరిజన సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, సిద్ధేశ్వర గ్రామ నాయకులు మధు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# క్రెడో స్కూల్ విద్యార్థినీలకు రోడ్డు భద్రతపై అవగాహన

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** కర్నూలు మండలంలో బి తాండ్రపాడు గ్రామంలోని జిల్లా రవాణా వాఖ కార్యాలయంలో 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా 25వ రోజు సోమవారం క్రెడో స్కూల్ విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ ఎస్ శాంతకుమారి,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రలు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి నుండి పాఠశాలకు మరియు పాఠశాల నుండి ఇంటికి తీసుకెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతను,బస్సు ఎక్కేటప్పుడు,దిగేటప్పుడు ఎలా ఎక్కాలి..దిగాలి..అనే దానిపై సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబి సుధాకర్‌రెడ్డి,నాగరాజు నాయక్,బాబు కిషోర్,గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

